విద్యుత్ సమస్యలకు చెక్




డైకస్‌రోడ్డు, కోటమిట్ట సెక్షన్ల పరిధిలో ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

- లో ఓల్టేజీ తలెత్తకుండా చర్యలు
- రూ.50 లక్షలతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సన్నాహాలు
- ఇప్పటికే రూ.25 లక్షలతో ఆరు ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వేసవి సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా ఆ శాఖ పటిష్ట చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. నగరంలోని 11 సెక్షన్లలో విద్యుత్ లోడ్ అధికంగా వచ్చే ప్రాంతాలను ఇప్పటికే గుర్తించారు. ఈ సెక్షన్ల పరిధిలో 11 అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు అవసరాన్ని గుర్తించి నివేదికను ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు, ఎస్ఈ విజయన్‌కు పంపారు. ఈ తరుణంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రూ.50 లక్షలను మంజూరు చేశారు. ఇందులో భాగంగా భక్తవత్సలనగర్, హరనాథపురం, కోటమిట్ట, డైకస్‌రోడ్డు సెక్షన్లలో రూ.25 లక్షలతో ఆరు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. మిగిలిన వాటిని త్వరితగతిన ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు



విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా నగరానికి 11 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేశారు. రానున్న వేసవిలో విద్యుత్ అంతరాయాలు, లో ఓల్టేజీ సమస్య వచ్చేందుకు అవకాశం లేదు.

– సోమశేఖర్‌రెడ్డి, నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

క్లుప్తంగా

వైద్యశిబిరానికి విశేష స్పందన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని చెల్లాయపాళెంలో మన ఊరు–మన పిల్లలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. చెల్లాయపాళెం, రేబాలకు చెందిన సుమారు 200 మంది వైద్యశిబిరానికి హాజరవగా వైద్యులు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. పేద ప్రజలకు విద్య, వైద్యం అందేలా చూడడం మన ఊరు–మన పిల్లలు కార్యక్రమం లక్ష్యమని వలంటీర్లు తెలిపారు. స్థానిక నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. నెల్లూరుకు చెందిన వేణుగోపాల్ పనినిమిత్తం మోటార్‌సైకిల్‌పై నిడిగుంటపాళెనికి వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళుతున్న క్రమంలో గొలగమూడి సమీపంలో ఎదురుగా వచ్చిన టిప్పర్‌కు సైడిచ్చే క్రమంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో వేణుగోపాల్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

కన్యకాపరమేశ్వరి అగ్ని ప్రవేశ మహోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి అగ్ని ప్రవేశ మహోత్సవాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలవిరాట్‌కు విశేష సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేక వేదికపై చేర్చి మహిళలు వడిబాల బియ్యం, పసుపు, కుంకుమలు, ఎండు కొబ్బరి, తాంబూలాలతో 'సారె' సమర్పించారు. అనంతరం అగ్ని ప్రవేశ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. అమ్మ వారు ఏ పరిస్థితుల్లో తన జీవితాన్ని త్యాగం చేసి అగ్నిప్రవేశం చేసిన ఘట్టాన్ని అర్చకులు భక్తులకు వివరించారు. ఉభయకర్తలుగా పోకూరు జ్ఞానయ్య దంపతులు వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు దోర్నాదుల సురేష్‌బాబు, హజరత్తయ్య, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దేశ వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి

ఉదయగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న దేశ వ్యాప్తంగా జరిగే బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు కె.వెంకటయ్య పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రైతు సంఘాల నాయకులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు తెచ్చిన నల్ల చట్టాలను రద్దు చేస్తామన్న కేంద్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదన్నారు. కేంద్రం లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, ఫరీద్దీన్‌బాషా, రమణయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే ఆరోగ్యం

ఆత్మకూరు/ చేజర్ల: ప్రతి ఒక్కరు ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మనస్సు ప్రశాంతంగా ఉంటుందని ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన ప్రముఖ పిరమిడ్ ధ్యాన మాస్టర్ తిరుపతిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని షిరిడీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం, చేజర్ల మండలం పులనీళ్లపల్లిలోని వెంకయ్యస్వామి గుడిలో ప్రత్యేక ధ్యాన తరగతులు నిర్వహించారు. మాస్టర్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ చిన్న వయసు నుంచే ధ్యానం వల్లన కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం వారి పిల్లలకు ధ్యానం అలవాటు చేయాలన్నారు. ఒత్తిడి జీవితంలో అనేక రోగాలు సంక్రమిస్తాయని, వాటిని అదుపులో ఉంచాలంటే ధ్యానం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పిరమిడ్ మాస్టర్ మూరంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, చేజర్ల కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఆపస్ టాలెంట్ టెస్ట్

సోమశిల: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అనంతసాగరం మండల శాఖ ఆధ్వర్యంలో ఆపస్ టాలెంట్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. సుమారు 65 పాఠశాలల నుంచి దాదాపు 800కు పైగా 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో టాప్ 10 విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతుల ప్రదానం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు విడివిడిగా మొదటి ముగ్గురికి విశ్వసాయి విద్యాసంస్థల యాజమాన్యం ఇంటర్మీడియట్ కోర్సుకు ఫీజు రాయితీ కల్పిస్తూ ధ్రువపత్రాలు అందజేశారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజగోపాలాచారి, అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

నెల్లూరు(బారకాసు): నగరాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా 17వ డివిజన్లోని అపోలో హాస్పిటల్ సమీపంలో గల కాలువల్లో ఆయిల్‌బాల్స్‌ను ప్రియదర్శిని స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆదివారం వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దోమల నివారణకు ఫాగింగ్, మందు పిచికారీతో పాటు కాలువల్లో ఆయిల్‌బాల్స్‌ను వదులుతున్నామని వివరించారు. ప్రియదర్శిని క్లబ్ అధ్యక్షురాలు సుధారాణి సహకారంతో ఆయిల్‌బాల్స్‌ను వదిలామని చెప్పారు. కార్పొరేటర్ సుధాకర్, క్లబ్ కార్యదర్శి కల్యాణి, ట్రెజరర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



కాలువలో ఆయిల్‌బాల్స్‌ను వదులుతున్న స్రవంతి తదితరులు

బీసీలకు సముచిత స్థానాన్ని కల్పించాలి

నెల్లూరు(వేదాయపాళెం): రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు సముచిత స్థానాన్ని కల్పించాలని బీసీ వెల్ఫేర్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొమ్మి నాగకిశోర్ డిమాండ్ చేశారు. ముత్తుకూరు రోడ్డులోని ఓ హోటల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రామ్మూర్తినగర్‌లోని ఎన్నార్ కల్యాణ మండపంలో బీసీ నేతలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని చెప్పారు. జిల్లాలో రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ సీటును బీసీలకు కేటాయించాలని కోరారు. సమావేశానికి బీసీ సంఘాల నేతలు హాజరుకావాలని కోరారు. వడ్డెర సంక్షేమ సంఘ నేత బెల్లంకొండ చిన్నయ్య, గౌడ సంఘ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, బీసీ నేతలు మన్నెం రాము, చంద్రశేఖర్, తరుణ్ సింగ్, బుధవరపు బాలాజీ, చిలకపాటి మాల్యాద్రి, పీఎల్‌రావు ముదిరాజ్, గండవరం భాస్కర్, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నేతలు

ఎస్టీయూ జిల్లా కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు (టౌన్): ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా రాజమనోహర్, ఆర్థిక కార్యదర్శిగా నరసింహం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఏడుకొండలు, కృష్ణయ్య, కృష్ణ, మహేష్ తదితరులు నియమితులయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ వ్యవహరించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు, నరసింహం, వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



చైతన్యపురిలో రక్తదాన శిబిరం



నెల్లూరు సిటీ: నగరంలోని చైతన్యపురి పార్కులో రక్తదాన శిబిరాన్ని పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కొండూరు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దాదాపు 52 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసోసియేషన్ ద్వారా పార్కు నిర్వహణతో పాటు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, చక్కా సాయిసునీల్, మహేష్‌నాయుడు, వెంకటేశ్వర్లు, డాక్టర్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాంగులకు సీట్లు కేటాయించాలి

నెల్లూరు(వేదాయపాళెం): రానున్న ఎన్నికల్లో దేవాంగులకు తగిన ప్రాధాన్యమిచ్చే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని దేవాంగ సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య పేర్కొన్నారు. రామ్మూర్తినగర్‌లోని దేవాంగ సంక్షేమ సంఘ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. నేతలు వెంకటసురేష్, మాధవయ్య, నవోదయ, హైమావతి, ప్రశాంతి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశం

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 35 వేల డీఎస్సీ పోస్టులను ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జనార్దన్‌రావు కోరారు. నగరంలోని వెంకటేశ్వర విద్యాలయంలో ఏపీటీఎఫ్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, కార్యవర్గ సభ్యులు కృష్ణారెడ్డి, జుల్ఫికర్ అలీ, రాష్ట్ర కౌన్సిలర్లు ఆరిఫ్ హుస్సేన్, హజరత్తయ్య, రాధాకృష్ణ, రాజశేఖర్, జిల్లా సభ్యులు రామసుబ్బారెడ్డి, కరీమ్ మొహిద్దీన్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనార్దన్‌రావు

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 నుంచి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు.

రూ.5.51 కోట్లతో బీటీ రోడ్ల అభివృద్ధి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు : మార్కెటింగ్ శాఖ నిధులు రూ.5.51 కోట్లతో పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని బీటీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వావిళ్లలో బీటీ రోడ్ల అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.కోటితో వావిళ్ల సెంటర్ నుంచి రామతీర్థం రోడ్డు వరకు, రూ.1.50 కోట్లతో బుచ్చిరెడ్డిపాళెం–ఊటుకూరు రోడ్డును వావిళ్ల వరకు, రూ.91 లక్షలతో వావిళ్ల నుంచి అలగానిపాడు వరకు, రూ.1.30 కోట్లతో పార్లపల్లి నుంచి చవటపాళెం వరకు, రూ.80లక్షలతో చౌకచర్ల నుంచి పల్లెపాళెం వరకు రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. రోడ్ల పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రోడ్ల నిర్మాణానికి సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇనగంటి సురేంద్రరెడ్డి, మురళీరెడ్డి, బెల్లంకొండ శ్రీధర్, బుచ్చింగారి తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మనుబోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 1982–87 మధ్య చదివిన పూర్వవిద్యార్థుల ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. మూడు నెలలకు ముందే వాట్సాప్ గ్రూపు ద్వారా సమాచారం అందించడంతో అమెరికా, జర్మనీ తదితర దేశాలతో పాటు హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, విశాఖపట్నం, తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఆత్మీయ సమ్మేళనానికి ఉత్సాహంగా హాజరయ్యారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు పంచుకుని ఉత్సాహంగా ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించారు. ప్రస్తుత హెచ్‌ఎం డేవిడ్ కోరిక మేరకు పాఠశాల ఆవరణలో వేదిక నిర్మాణానికి హామీ ఇచ్చారు. అనంతరం చెమర్చిన కళ్లతో ఒకరికొకరు వీడ్కోలు తీసుకున్నారు.

వైఎస్సార్సీపీ విజయానికి సమష్టిగా పనిచేద్దాం



మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్

- ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయానికి సమష్టిగా కృషి చేద్దామని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. 49, 50, 52వ డివిజన్లకు సంబంధించిన పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని రంగనాయకులపేటలోని మాదాల బాలతిమ్మయ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ నగర నియోజకవర్గ సమన్వయకర్తగా తనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారని చెప్పారు. తనకు సహకారం అందించాలని కోరారు. కార్పొరేటర్లు వందవాసి రాజేశ్వరి, గుంజి జయలక్ష్మి, అస్మ, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదెల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర షూటింగ్ ప్రారంభం

నెల్లూరు(బృందావనం): సామాజిక చైతన్యంతో నిర్మిస్తున్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బన్నిగాడి ప్రేమకథ చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవాన్ని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. హీరో, హీరోయిన్లు భరణిశంకర్, రూపారెడ్డి, విజయభాస్కర్, చిత్ర దర్శకుడు కువ్వారపు నాగేశ్వరరావు, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, వెంకి, పాటల రచయిత మురళీమోహన్‌రాజు, నిర్మాత కోడూరు శైలజ, కళాసంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేడుకగా హిందీ ఆరాధన వార్షికోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని బాప్టిస్ట్ చర్చి డౌనీ హాల్ హిందీ ఆరాధన వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకారాధనలో సంఘ కాపరి రెవరెండ్ శ్యామ్‌సన్ కుమార్ వాక్యోపదేశం చేశారు. ఈ సందర్భంగా ఆలపించిన ప్రత్యేక హిందీ భక్తి గీతాలు అలరించాయి. ఎవాంజలిజమ్ డైరెక్టర్ జార్జి స్టీవెన్సన్, కృపారాజన్, జానీజో, రమేష్, మహేష్, దినేష్, హుల్దా శ్యామ్‌సన్, భారతి ఎర్నెస్ట్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కళానీరాజనం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో కళానీరాజనాన్ని బయ్యా వెంకటరమణయ్య, సరోజనమ్మ స్మృత్యర్థం ఆదివారం నిర్వహించారు. తొలుత వీరి చిత్రపటాలకు నివాళులర్పించారు. సుస్వర.. లక్కీ ఆర్కెస్ట్రాల నిర్వాహకులు రాజశేఖర్, పెంచలరెడ్డిని సత్కరించి సంగీత సామ్రాట్ పురస్కారాలను అందజేశారు. పాటలు, నృత్య పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఓ మలోల, శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు, మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, జయప్రకాష్, రియాజ్‌బాషా, లక్ష్మి, ప్రశాంతి, చైత్రచరిత్ర, లయ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే ధ్యేయం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు(తోటపల్లిగూడూరు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. తోటపల్లిగూడూరు మండలం అనంతపురంలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లు, డ్రెయిన్లను ఆదివారం సాయంత్రం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీనే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇంటి వద్దే పెన్షన్ అందజేస్తోందన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చామని వివరించారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కూడా పరిష్కరించామన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పేదలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. తొలుత అనంతపురానికి వచ్చిన మంత్రి కాకాణికి స్థానిక కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్లకూరు సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కలశాల ఊరేగింపు



కలశాలతో గ్రామోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం విశేషాభిషేకాలు, పూజలు పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అగ్నిగుండ ప్రవేశం చేసిన రోజును పురస్కరించుకుని తొలుత 102 కలశాలతో ఆర్యవైశ్యులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కలశ జలాలతో అమ్మవారికి అభిషేకం జరిపారు. కలశాల ఊరేగింపులో కోలాట ప్రదర్శన, చిన్నారులు దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.